





RNI : APBIL/2023/86665

# రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక
ROYAL JOURNALISM

గుంటూరు, సంపుటి : 01 సంచిక : 293 | ఆదివారం 1 డిశంబర్ 2024 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | పేజీలు : 8 | వెల : రూ.2-00

GUNTUR VOL-01 ISSUE - 293 CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO 1 SUNDAY DECEMBER 2024 PAGES : 8 Rs :2-00


## పెన్షన్ల పంపిణీలో పైసా అవినీతి ఉన్నా ఒప్పుకోను: సీఎం చంద్రబాబు

### అనంతపురం జిల్లా నేమకల్లు గ్రామంలో చంద్రబాబు పర్యటన



నేమకల్లు (అనంతపురం) : ఏపీలో ఒక రోజు ముందుగానే సామాజిక పెన్షన్లు అందజేశారు. డిసెంబరు 1వ తేదీ ఆదివారం రావడంతో, నేడు నవంబరు 30వ తేదీనే ఇంటింటికీ తిరిగి పెన్షన్లు అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అనంతపురం జిల్లా నేమకల్లులో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వయంగా ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు అందించారు. చంద్రబాబు నేమకల్లులో దివ్యాంగు రాలు భాగ్యమ్మ ఇంటికి వెళ్లారు. ఆమె కుటుంబ పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఆమెకు దివ్యాంగ పింఛను రూ.15 వేలు అందజేశారు. అదే గ్రామంలో రుద్రమ్మ అనే వితంతు మహిళ ఇంటికి కూడా వెళ్లి పెన్షన్ అందజేశారు. ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లా డుతూ... ఇద్దరు మహిళల ఇళ్లకు వెళ్లి స్వయంగా పెన్షన్లు అందించానని వెల్లడించారు. ప్రజల్లోని ఆనందం శాశ్వతంగా ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు. మెరుగైన పెన్షన్ల ద్వారా వితంతువులు, దివ్యాంగులకు ఉండగా ఉన్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. "అణగారిన వర్గాలకు అండగా ఉండడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఎన్నికల హామీ మేరకు పెం చిన పెన్షన్లను ఏప్రిల్ నుంచి లెక్కగట్టి ఇచ్చాం. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో పెన్షన్లను ప్రవేశపెట్టింది ఎన్టీఆర్. ఇప్పుడు రాష్ట్రంలో 64 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నా ం. పెన్షన్ల రూపంలో ఈ ఐదు నెలల్లో రూ.18 వేల కోట్లు పంపిణీ చేశాం. పెన్షన్ మూడు నెలలకు ఒకసారి కూడా తీసుకునే వెసులుబాటు కల్పించాం. పెన్షను లబ్ధిదారుల్లో కూలీలు, కార్మికులు ఉన్నారనే ఈ సౌకర్యం తీసుకువచ్చాం. దేశంలోనే ఎక్కువ పెన్షన్ ఇచ్చే రాష్ట్రం మనదే. పెన్షన్ల పంపిణీలో పైసా అవినీతి ఉండకూడదని స్పష్టం చేశాను. పేదలకు అనేక రకాలుగా మేలు చేయాలని ఉంది... కానీ సమస్యలు చాలా ఉన్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనతో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయి. ముందు వాటిని బాగు చేయాల్సి ఉంది" అని సీఎం చంద్రబాబు వివరించారు.

**అనంతపురం జిల్లా అంటే నాకు ప్రత్యేకమైన అభిమానం: చంద్రబాబు**

మీ పంటలకు నీళ్లు ఇస్తానని గతంలో ఇక్కడి రైతులకు హామీ ఇచ్చాను. రాయలసీమను రతనాల సీమగా మార్చుతానని చెప్పాను. మొన్నటి ఎన్నికల్లో ప్రజలంతా ఆలోచించి ఓటేశారు. అనంతపురం జిల్లా అంటే నాకు ప్రత్యేకమైన అభిమానం ఉంది. రాయదుర్గం అంటే చాలా వెనుకబడిన ప్రాంతం. రాయదుర్గం ప్రాంతం ఎడారిగా మారకుండా చర్యలు చేపట్టాం. రాయదుర్గం ప్రజల్లో వెలుగులు నింపే బాధ్యత తీసుకుంటాం. హంద్రీ నీవాపై రూ.4,500 కోట్లు ఖర్చు చేశాం. రాయలసీమలోని ప్రాజెక్టులకు రూ.12,500 కోట్లు ఖర్చు చేశాం. ఇక్కడున్న నేమకల్లు ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత తీసుకుంటాం.

## మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ అనుమానాలు... ఆహ్వానించిన ఈసీ




న్యూఢిల్లీ :మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ పార్టీ అనుమానాలు వ్యక్తం చేయడంపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. ఏవైనా అనుమానాలు ఉంటే డిసెంబర్ 3న వచ్చి అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చని ఆహ్వానించింది. ప్రతి ఎన్నిక కూడా పారదర్శకంగా జరుగుతోందని తెలిపింది. వారి చట్టపరమైన ఆందోళనలను తాము పరిశీలిస్తామని తెలిపింది. కాంగ్రెస్ పార్టీ ప్రతినిధుల బృందం అనుమానాలు విన్న తర్వాత రాతపూర్వక సమాధానం ఇస్తామని తెలిపింది.మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ పార్టీ శుక్రవారం నాడు ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. వ్యక్తిగతంగా హాజరై తమ అనుమానాలను తెలియజేస్తామని ఆ లేఖలో పేర్కొంది. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీకి ఈసీ నుంచి పిలుపు వచ్చింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి భారీ విజయం సాధించింది. ప్రతిపక్ష కూటమి కేవలం 46 సీట్లకే పరిమితమైంది.

## జనవరి నుంచి జనంలోకి జగన్.. క్షేత్ర స్థాయి పర్యటనలకు ప్లాన్



అమరావతి: వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జనంలోకి వెళ్లేందుకు సన్నద్ధం అవుతు న్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటనకు ప్లాన్ చేస్తున్నారు. సంక్రాంతి తర్వాత వారంలో రెండు రోజుల పాటు జిల్లాల్లో పర్యటనలు చేయనున్నారు. ఈ విషయాన్ని స్వయంగా వైఎస్ జగన్ వెల్లడించారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఉమ్మడి కృష్ణా జిల్లా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ సంక్రాంతి తర్వాత పార్లమెంట్ యూనిట్‌గా జిల్లాల్లో పర్యటి స్తానని చెప్పారు. ప్రతి బుధ, గురువారం జిల్లాల్లోనే ఉంటూ కార్యకర్తలతో మమేకమవుతానని తెలిపారు. జనవరిలో పార్టీలోని వివిధ విభాగాల నియామకాలు పూర్తి చేయాలని, జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి వరకూ పూర్తవ్వాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి ఎమ్మెల్యే, ఎంపీ వరకూ సోషల్ మీడియా అకౌంట్‌లు (ఫేస్ బుక్, ఇన్‌స్టా, వాట్సాప్) ఉండాలని, ఎక్కడ అన్యాయం జరిగినా వెంటనే వీడియో తీసి అప్‌లోడ్ చేయాలని జగన్ దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని విమర్శించిన జగన్.. ప్రతి గ్రామంలోనూ టీడీపీని, చంద్రబాబును ప్రశ్నించాలని సూచి ంచారు. చంద్రబాబు ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారన్నారు. చంద్రబా బు హామీలపై ప్రజలు ఆశపడ్డారని, కానీ ఆరు నెలలు తిరక్క మునుపే ప్రజలకు వాస్తవం అర్థమయిందన్నారు. ప్రతి ఇంట్లో దీనిపై చర్చ జరుగుతోందని అన్నారు. రాష్ట్రంలో ప్రతి వ్యవస్థ కుప్పకూలిపోయిందని ధ్వజమెత్తారు. ప్రతిపక్షంలో ఉన్నాం కాబట్టి కష్టాలు, నష్టాలు ఉంటాయి అయినా పోరాట పటిమ తో ముందుకు సాగాలని క్యాడర్‌కు జగన్ సూచించారు.



## ఎంపీ హోదాలో తొలిసారి వయనాడ్‌కు ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ : ఏఐసీసీ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ ఎంపీ హోదాలో తొలిసారి వయనాడ్‌లో అడుగు పెట్టారు. ఇటీవల జరిగిన వయనాడ్ లోక్ సభ ఉప ఎన్నికల్లో ఆమె భారీ మెజార్టీతో విజయం సాధించారు. రెండు రోజుల క్రితం ఎంపీగా ప్రమాణం చేశారు. ఈ నేపథ్యంలో తనను గెలిపించిన నియోజకవర్గానికి ఎంపీ హోదాలో వెళ్లారు.తన సోదరుడు, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో కలిసి శనివారం ఉదయం ఆమె కేరళ చేరుకున్నారు. వయనాడ్‌లోని ముక్కంలో బహిరంగ సభలో పాల్గొన్నారు. ఆమె రెండు రోజుల పాటు వయనాడ్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో సమీప సీపీఐ అభ్యర్థి సత్యన్ మొకేరిపై ప్రియాంక గాంధీ 4 లక్షల పైచిలుకు ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి నవ్య హరిదాస్‌కు దాదాపు లక్షా పదివేల ఓట్లు పడ్డాయి. సీపీఐ అభ్యర్థికి 2 లక్షల 83 వేల పైచిలుకు ఓట్లు పడ్డాయి.

## ఏక్ నాథ్ షిండేను పక్కన పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు: శివసేన నేత సంజయ్ శిర్సాట్

న్యూఢిల్లీ : మహారాష్ట్ర ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఎన్డీయే కూటమి ప్రభుత్వ ఏర్పాటులో మాత్రం ఏకాభిప్రాయానికి రాలేకపో తోంది. తదుపరి సీఎం, మంత్రుల కేటాయి ంపుపై కూటమి పార్టీల మధ్య ఏకాభిప్రాయం రాలేదు. కూటమి ముఖ్య నేతల భేటీని అపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే రద్దు చేసు కోవడం చర్చనీయాంశమయింది. ఈ నేపథ్య ంలో శివసేన నేత సంజయ్ శిర్సాట్ కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్త ప్రభుత్వంలో షిండేను పక్కన పెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతు న్నాయని సంజయ్ అన్నారు. షిండే నేతృత్వంలో మహాయుతి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం వల్ల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి లబ్ధి చేకూరిందని చెప్పారు. కొన్ని పథకాలకు ఎన్సీపీ అభ్యంతరం చెప్పినప్పటికీ... షిండే వాటిపై ముందుకు వెళ్లారని... ఆ పథకాలన్నీ ఎన్నికల్లో కూటమికి ఓట్లు కురిపించాయని అన్నారు. డిప్యూటీ సీఎంకు హోం శాఖను ఇవ్వడం సహజంగా జరిగే ప్రక్రియ అని... అలా కాకుండా హోం శాఖను సీఎం వద్ద ఉంచుకోవడం సరికాదని చెప్పారు. కొత్త ప్రభుత్వంలో షిండేకు కీలక శాఖలను ఇవ్వకుండా పక్కన పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. బీజేపీకి సీఎం పదవి ఇస్తే... శివసేనకు హోం మంత్రి పదవిని ఇవ్వాలని అన్నారు.

## తప్పించుకోలేరు, లెక్క తేలుస్తాం - పేర్ని నాని



అమరావతి:వైసీపీ శ్రేణుల పైన కేసుల విషయంలో ఆ పార్టీ నేతలు మండిపడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా విమర్శలు చేస్తున్నారు. పోలీసు శాఖలో కొందరు అధికారులు పచ్చ చొక్కా లు వేసుకొని పని చేస్తున్నారని మండిపడుతున్నారు. అదే సమయంలో అధికారం శాశ్వతం కాదని.. వేధించిన వారు చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం వైసీపీ నేతల వ్యాఖ్యలు సంచలనంగా మారుతున్నాయి.వైసీపీ కార్యకర్తల అరెస్ట్ పై మాజీ మంత్రి పేర్ని నాని ఘాటుగా వ్యాఖ్యలు చేసారు. అధికారం శాశ్వతం కాదని..అధికారం ఎప్పుడూ ఉండదని చంద్రబాబు అండ్ టీం గుర్తుంచుకో వాలని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల ను చంద్రబాబు సర్కార్ గాలికొదిలేసిందని మండి పడ్డారు. ప్రభుత్వాన్ని వైసీపీ నేతలు, కార్యకర్తలు ప్రశ్నిస్తే వారిని టార్గెట్ చేయటమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. తప్పుడు కేసులతో వైసీపీ శ్రేణులను వేధించటం కోసమే పోలీసు వ్యవస్థను వినియోగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు.తప్పుడు కేసులు పెడుతున్నారని పేర్ని నాని ధ్వజమెత్తారు. పాత కేసులను తిరగదోడి వేధిస్తున్నా రని ఆరోపించారు. గన్నవరంలో 8 మంది వైసీపీ నేతలను అక్రమంగా కేసుల్లో ఇరికించారని ఆగ్రహం వ్యక్తం చేసారు. న్యాయమూర్తి 307 కేసును తొలగించారని చెప్పారు. రెండు సార్లు విచారణ అయ్యాక ఏముందని పోలీస్ కస్టడీకి కోరుతున్నారని పేర్ని నాని ప్రశ్నించారు. అమయకుల ను తీసుకొచ్చి ముద్దాయిలను చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ జెండా, జగన్ బొమ్మపెట్టుకుని తిరగకుండా చేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. తమతో పాపాలు చేయిస్తున్నారని కొందరు పోలీసు అధికారులు బాధపడుతున్నారని చెప్పుకొచ్చార. అధికార పార్టీ కోసం పని చేస్తున్న వారు భవిష్యత్ లో తగిన మూల్యం చెల్లించుకుంటారని నాని హెచ్చరించారు.

## పవన్ ఆరోపణలపై చంద్రబాబు మౌనం

### కాకినాడ ఎమ్మెల్యే పాత్రపై చర్చ..



అమరావతి: ఏపీలో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సులువైన మార్గంగా మారిన కాకినాడ పోర్టులో నిన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా కాకినాడ పోర్టులోకి వివిధ కారణాలతో తనను రానివ్వకుండా రెండు నెలలు అధికారులే అడ్డుకున్నారని, చివరికి పోర్టులోకి వచ్చినా షిప్ లోకి ఎక్కనివ్వకుండా సాకులు చెప్పారని పవన్ చేసిన ఆరోపణలు, కాకినాడ టీడీపీ ఎమ్మెల్యే మౌనాన్ని ప్రశ్నించిన తీరు ఇప్పుడు పొలిటికల్ సర్కిల్స్ లో హాట్ టాపిక్ గా మారింది. కాకినాడ పోర్టులో రేషన్ బియ్యమే కాదు డ్రగ్స్, పేలుడు పదార్థాలు కూడా అక్రమ రవాణా అయ్యే అవకాశం ఉందని, కసబ్ లాంటి ఉగ్రవాదులు దేశంలోకి వచ్చే ప్రమాదం ఉందని, పోర్టు భద్రతపై అమిత్ షాకు లేఖ రాస్తానని పవన్ నిన్న హుంకరించారు. అయితే దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందిస్తుందని అంతా భావించారు. కానీ ఎన్డీయే ప్రభుత్వం నుంచి ఇప్పటివరకూ ఎలాంటి స్పందన లేదు. ముఖ్యంగా సీఎం చంద్రబాబు కూడా పవన్ వ్యాఖ్యలపై గతంలో రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో పవన్ కళ్యాణ్ చేసిన విమర్శలు నేరుగా ప్రభుత్వ పెద్దల్ని తాకాయి. దీంతో వెంటనే రంగంలోకి దిగి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారికి చుక్కలు చూపించిన ప్రభుత్వం.. ఇప్పుడు కాకినాడ పోర్టు విషయంలో పవన్ చేసిన ఆరోపణలపై మాత్రం మౌనంగా ఉం డటం చర్చనీయాంశమవుతోంది. ముఖ్యంగా కాకినాడ పోర్టులో ఇంత జరుగుతున్నా స్థానిక టీడీపీ ఎమ్మెల్యే కొండబాబు ఎందుకు పట్టించుకోవడం లేదని పవన్ వేసిన ప్రశ్న ఇప్పుడు ప్రభుత్వాన్ని తాకినట్లు కనిపిస్తోంది. కాకినాడ పోర్టులో భారీ ఎత్తున అక్రమ బియ్యం విదేశాలకు రవాణా కావడం, డిప్యూటీ సీఎం స్థాయిలో ఉన్న పవన్ కళ్యాణ్ నే అడ్డుకున్న తీరు, పవన్ వచ్చినప్పుడల్లా జిల్లా ఎస్పీ అందుబాటులో లేకుండా సెలవుపై వెళ్లిపోవడం వంటి కారణాలు చూస్తుంటే అక్కడ ఏదో జరుగుతోందన్న భావన ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా నెలకొంది. అదే సమయంలో కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలకు తెలియకుండా పోర్టులో ఏదో జరిగే అవకాశాలు అస్సలు లేవు. ఈ నేపథ్యంలో పవన్ వ్యాఖ్యలపై వెంటనే స్పందిస్తే ఇబ్బందులు తప్పవన్న భావనతో చంద్రబాబు మౌనంగా ఉన్నారా అన్న చర్చ జరుగుతోంది.

# ఎడిటోరియల్

## ప్రత్యేక హెూదా!

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హెూదా ఇచ్చే విషయంలో రాత పూర్వక హామీ లేనందున దీనిపై వ్యాజ్యంగా తీసుకోలేమని హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించడం ధర్మం కాదు. ప్రత్యేక హెూదా అంశం రెండు ప్రభుత్వాల పరిధిలోని విషయమని, ప్రభుత్వాలు ఏం చేయాలో కోర్టులు చెప్పలేవని పేర్కొనడం నిరాశ కలిగించింది. పార్లమెంట్‌లో ఇచ్చిన హామీకి అనుగుణంగా రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇచ్చేలా కేంద్రానికి ఆదేశాలు ఇవ్వాలంటూ ప్రజాశాంతి పార్టీ అధినేత కెఎ పాల్ దాఖలు చేసిన పిల్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. ప్రత్యేకహెూదాపై మౌఖికంగానే కేంద్రం హామీ ఇచ్చిందని, రాతపూర్వకంగా లేనప్పుడు కోర్టులు ఎలా జోక్యం చేసుకుంటాయని కేంద్ర ప్రభుత్వం తరపున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ ప్రశ్నించడం తెంపరితనమే. అంతేగాక ఈ రాష్ట్ర ప్రజలను, వారి ఆకాంక్షలనూ తృణీకరించడమే ఔతుంది. పార్లమెంటులో ప్రధాని చేసిన ప్రకటనకు విలువ లేదని వాదించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం కూడా. వామపక్ష ఎంపిలతోపాటు బిజెపి సభ్యులు కూడా ప్రత్యేక హెూదా కోసం ఆనాడు డిమాండ్ చేశారు. నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రత్యేక హెూదాపై పార్లమెంటులో ప్రకటన కూడా చేశారు. అప్పుడు రాత పూర్వక హామీ ఇవ్వలేదని, దానికి విలువ లేదని ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం చెప్పడం ముమ్మాటికీ విద్రోహమే! కమలనాథులకు ఇది వెన్నతో పెట్టిన విద్యని మరోమారు విదితమయింది.ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హెూదా ప్రకటించాలన్న డిమాండ్ అత్యంత న్యాయసమ్మతమైనది, ధర్మబద్ధమైనది. కేంద్ర ప్రభుత్వ విద్రోహంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి. కార్యాచరణకు పూనుకోవాలి. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ బిజెపితో అధికారం పంచుకుంటున్నారు కనుక టిడిపి, జనసేన నాయకులు కిమ్మనకుండా ఉండరాదు. ఒకప్పుడు ధర్మపోరాట దీక్షలని ఊరూరా తిరిగి యువతను, విద్యార్థులనూ సమీకరించిన ఈనాటి ముఖ్యమంత్రి ఒకసారి వాటిని గుర్తుకు తెచ్చుకోవడం అవసరం. ఆనాడు పాచిపోయిన లడ్డూలంటూ ఎద్దేవా చేసిన నేటి ఉప ముఖ్యమంత్రి తన వైఖరిని తెలుగు ప్రజలకు వెల్లడించాలి. తెలుగు ప్రజల ఆత్మగౌరవం పేరిట తెలుగుదేశం పార్టీని స్థాపించి కేంద్ర ప్రభుత్వ నిరంకుశ చర్యలను ఎదిరించిన ఎన్‌టి రామారావు వారసులమని చెబుతున్న ఆ పార్టీ నేతలు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి. రాష్ట్రాల హక్కుల కోసం ప్రతిపక్ష పాలిత ముఖ్యమంత్రులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, రాజ్యాంగంలోని ఫెడరలిజాన్ని కాపాడడానికి అవిరళ కృషి చేసిన యోధుడు ఎన్‌టిఆర్. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, విభజన హామీల సాధన ద్వారానే అటువంటివారి కలలు నెరవేరుతాయి. ఆ దిశగా టిడిపి శ్రేణులు యోచిస్తే పాలక కూటమిపై ఒత్తిడి పెరుగుతుంది.భారతదేశ చరిత్రలో మొట్టమొదట ఏర్పడ్డ భాషాప్రయుక్త రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌ను కాంగ్రెస్, బిజెపి కూడబలుక్కొని నిలువునా చీల్చాయి. తీవ్రమైన నష్టాన్ని కలిగించే రాష్ట్ర విభజనను కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజలు వ్యతిరేకించడంతో పార్లమెంటులో ప్రత్యేక హెూదా, అదేవిధంగా ఇంకొన్ని హామీలనూ ఇచ్చారు. అంతేగాక 2014 ఎన్నికల్లో రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇస్తామనీ, విభజన హామీలు నెరవేరుస్తామనీ నరేంద్ర మోడీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ తిరుపతి బహిరంగ సభలో వాగ్దానం చేసి కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారానికి వచ్చారు. కానీ మోడీ సర్కారు మాట మార్చి 'హెూదా ముగిసిన అధ్యాయం' అని ప్రకటించి రాష్ట్ర ప్రజలను మోసపుచ్చింది. ఆ తరువాత రాష్ట్రంలో అధికారానికి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి కూడా హెూదాపై ఏమీ చేయలేమని చేతులెత్తేయడం దారుణం. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హెూదా ఒక తప్పనిసరి అవసరం. రాష్ట్ర పారిశ్రామికీకరణకు, యువతకు ఉపాధి కల్పనకూ, రాష్ట్ర బడ్జెట్ సహాయానికీ౫% ఇలా సకల విధాలా ఇది ఎంతో ప్రయోజనకరం. దాన్ని సాధించుకోవడానికి రాష్ట్ర ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలి. పాలకులను నిలదీయాలి.

# ఆటోమొబైల్ టెక్నాలజీ పై విద్యార్థులకు అవగాహన

## ఉపాధికి రక్షణ... నైపుణ్య శిక్షణ






రామసముద్రం.నవంబర్ 30 రాయలు జర్నలిజం.మండలం దిన్నె పల్లె సమీపంలో ఉన్న ఆదర్శ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఆటోమొబైల్ టెక్నాలజీ ఆటోమోటివ్ వృత్తి విద్యా ట్రేడ్ విద్యార్థులు ఇండస్ట్రియల్ పై 9వ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందని ప్రిన్సిపాల్ మునిస్వామి నాయక్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని చక్కగా చదువుకొని మన చదువుతోపాటు విద్యార్థులు స్కిల్ డెవలప్మెంట్ ని డెవలప్ చేసుకోవాలని తెలిపారు. అనంతరం రామసముద్రంలోని స్థానిక మసీదు ఎదురుగా ఉన్న టువంటి శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర టు వీలర్ మెకానిక్ షాప్ నందు విద్యార్థులకు మెకానికల్ ఇంజనీరింగ్ పై టు వీలర్ ఇంజన్ ఎలా అమర్చాలి ఆ స్పేర్ పార్ట్స్ ఆ ఇంజన్లో ఏవేవి వస్తువులు ఉంటాయని ఆ ఇంజన్ ఎలా రన్ అవుతుందని ఆదర్శ పాఠశాల విద్యార్థులకు సీనియర్ మెకానిక్ వెంకటేష్ ఓ టూ వీలర్ ఇంజన్ ని విద్యార్థులకి వాటి పరికరాల గురించి వివరిస్తూ ఇంజన్ ని అమర్చారు. ఈ మెకానికల్ ఇంజనీరింగ్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆటోమోటివ్ వొకేషనల్ ట్రైనర్ బి విజయ కుమార్,పి ఈ టి ఇంద్రాణి, మెకానిక్ వెంకటేష్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# వర్షంలో కూడా ప్రజల కష్టాలు వింటూ.... వినతులు స్వీకరిస్తూ

## ప్రజాదర్బార్ లో బాధితులకు మంత్రి మండిపల్లి భరోసా



రాయల్ జర్నలిజం,రాయచోటి, నవంబర్ 30:రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వర్షంలోనూ ప్రజల కష్టాలు వింటూ.... వినతులు స్వీకరిస్తూ ముందుకు వెళుతున్నారు.శనివారం రాయచోటి పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయం నందు రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలు విన్నవించేందుకు అధిక సంఖ్యలో ప్రజాదర్బార్ కు తరలివస్తున్నారు. వర్షం వస్తున్నప్పటికీ మంత్రివర్యులు ఏమాత్రం విసిగించుకోకుండా బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తూ వారి సమస్యలు పరిష్కరించడం జరుగుతుంది. అధికారులు ప్రజా దర్బార్ కార్యక్రమంలో వచ్చే అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులు వి. దివాకర్ పదవి విరమణ



రామసముద్రం.నవంబర్30 రాయల్ జర్నలిజం: రామసముద్రం మండలం చెంబకూరు గ్రామ పంచాయతీలోని చెంబకూరు ఎంపిపి పాఠశాలలో 1998 నుండి 2024 వరకు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన ఉత్తమ ఉపాధ్యాయులు మరియు ఉపాధ్యాయుల సంఘానికి కూడా విశేష సేవలు అందించిన వి. దివాకర్ ఉపాధ్యాయులకు పదవి విరమణ సన్మాన కార్యక్రమం శ్రీ వాసవీ కల్యాణ మండపంలో తూర్పు పాఠశాల హెచ్‌ఎం మరియు జిల్లా యుటిఎఫ్ సహా అధ్యక్షురాలు హేమలత ఆధ్వర్యంలో ఈ సందర్భంగా వారికి తోటి ఉపాధ్యాయులు మరియు మిత్రులు, శ్రేయోభిలాషులు దుష్యాలువలతో, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. మరియు పదవి విరమణ తరువాత ఆయనకు కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆశీస్సులు ఆయనపై వుండి ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలతో జీవించాలని దీవెనలు అందించారు.ఈ కార్యక్రమంలో మండల ఎంఈవో హేమలత,,రామసముద్రం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చిట్టిబాబు, చెంబకూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విష్ణుప్రియ,దివాకర్ సతీమణి డి. సుబ్బలక్ష్మి, జిల్లాలోని ఉపాధ్యాయులందరూ పాల్గొన్నారు.

# మూగవాడిలో సిసి రోడ్లను పరిశీలించిన ఎంపీడీవో భాను ప్రసాద్

## అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో



రామసముద్రం.నవంబర్ 30 రాయల్ జర్నలిజం. రామసముద్రం మండలంలోని మూగవాడి గ్రామం నందు శనివారం ఎంపీడీవో భాను ప్రసాద్ ఏపీవో గౌరీ శంకర్ నూతనంగా వేస్తున్నటువంటి సీసీ రోడ్లు తనిఖీ చేశారు. ఎంపీడీవో భాను ప్రసాద్ మాట్లాడుతూ నాణ్యతలో రాజీ పడకూడదని డిసెంబర్ చివరిలోగా సిసి రోడ్లను పూర్తి చేయాలని అవసర మైనచోట మరిన్ని పనుల కోసం మంజూరు. కొరకు ఎమ్మెల్యే షాజహాన్ భాష వేయడం జరుగుతుందని మగవాడి గ్రామంలో ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేశారు.గర్భిణీ స్త్రీలకు బాలింతలకు చంటి పిల్లలకు అందాల్సిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందుతుందా లేదా అన్న అంశంపై లబ్ధిదారులను అడిగి కనుక్కున్నారు.ఎక్కువగా ఆకుకూరలు పండ్లు తీసుకోవాలని ఆయన ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బంది తగ్గదరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు సంబేపల్లి హైస్కూల్ విద్యార్థుల ఎంపిక: మడితాటి నరసింహారెడ్డి

రాయల్ జర్నలిజం,రాయచోటి, నవంబర్ 30: యువ ఉత్సవ్-2024 లో భాగంగా రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న ప్రాజెక్టుల ప్రదర్శనకు సంబేపల్లి హైస్కూల్ విద్యార్థుల 'ఎకో సేఫ్ విత్ ఆక్వా సేఫ్' ప్రాజెక్టు ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వ నెహ్రూ యువ కేంద్రం వారి ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి లోని భాస్కర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ నందు నిర్వహించిన యువ ఉత్సవ్-2024 సైన్స్ ఎగ్జిబిషన్ లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు తరుణ్ కుమార్ గౌడ్, నాగచైతన్య రెడ్డి లు పాల్గొన్నారుప్లాస్టిక్ వాడకాన్ని నివారించి పర్యావరణాన్ని పరిరక్షించడానికి 'ఎకో సేఫ్ విత్ ఆక్వా సేఫ్' అను ప్రాజెక్టును ఈ ఎగ్జిబిషన్ లో ప్రాజెక్టుల ప్రదర్శనలో ప్రతిభ కనబరిచి మూడవ స్థానం సాధించిరూ. 3000 నగదును కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. అనంతరం జిల్లాస్థాయి ప్రాజెక్టుల ప్రదర్శనలో పాల్గొని ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను, గైడ్ టీచర్ మార్ల ఓబుల్ రెడ్డి ని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం, ఉప విద్యాశాఖాధికారి శివప్రకాశ్ రెడ్డి శనివారం ఉదయం ప్రత్యేకంగా అభినందించారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, చప్పిడి పద్మజ తదితరులు పాల్గొన్నారు.



# వర్షాలకు మరింత అద్వానంగా మారిన మదనపల్లి,నిమ్మనపల్లి రోడ్డు



రాయల్ జర్నలిజం (మదనపల్లి) నవంబర్ 30: అన్నమయ్య జిల్లా మదనపల్లి నుండి నిమ్మనపల్లి కి వెళ్లే రోడ్డు వర్షానికి మరింత అద్వానంగా మారింది. ఈ రోడ్డులో అత్యధికంగా ద్విచక్ర వాహనదారులు, రోజూ రిత్యా కూలీ పనులకు వెళ్లేవారు, ఉన్నత విద్యలకై బస్సులలో ప్రయాణించే విద్యార్థులు, ముఖ్యంగా టమేటా రైతులు ఆటోలలో ట్రాక్టర్లలో మదనపల్లి టమేటా మార్కెట్కు వెళుతుంటారు. కందూరు నుండి మదనపల్లికి వెళ్లాలన్నా కూడా ఈ రోడ్డు మీదనే వెళ్లాలి. కావున ఈ రోడ్డుపై రోజు వేలాదిమంది వాహనదారులు ప్రయాణిస్తుంటారు. వీరిలో అత్యధికంగా ద్విచక్ర వాహనదారులు, ట్రాక్టర్లు, ఆటోలు, మినీ బస్సులు మొదలైన వాహనాలు నిత్యం ప్రయాణిస్తూ ఉంటాయి. ముఖ్యంగా సుమారుగా నాలుగు నుండి ఐదు అంబులెన్సు కూడా ప్రయాణిస్తాయి.ఈ రోడ్డులలో రోజు ప్రయాణించే డ్రైవర్ లకు నడుము నొప్పి వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలుపుతున్నారు. ఎంతమంది ఎమ్మెల్యేలు మారినా కూడా ఈ రోడ్డు మాత్రం గత 15 సంవత్సరాలుగా పట్టించుకునే నాధుడే లేడు. మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ భాషా గారు సైతం ఇప్పటికే ఈ రోడ్డుపై ప్రత్యేక దృష్టి సాధించినట్లు తెలుస్తుంది.ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి వెంటనే మదనపల్లి నిమ్మనపల్లి రోడ్డు పూర్తి చేయాలని వాహనదారులు వాపోతున్నారు.



# టిడిపి శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్న బీసీ లీడర్ బెల్లె రెడ్డి ప్రసాద్



మదనపల్లె నవంబర్ 30 రాయల్ జర్నలిజం :-- అభినందించిన ఎమ్మెల్యే షాజహాన్ బాషా మదనపల్లె : కురవంకకు చెందిన టిడిపి నాయకులు,కురవ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లె రెడ్డి ప్రసాద్ తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని శనివారం ఎమ్మెల్యే షాజహాన్ బాషా సమక్షంలో తీసుకున్నారు.రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్న బెల్లె రెడ్డి ప్రసాదును ఆయన నివాసంలో ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జహా మాట్లాడుతూ బీసీలలో బలమైన నేతగా గుర్తింపు ఉన్న బెల్లె రెడ్డి ప్రసాద్ తెలుగుదేశం పార్టీ విధానాలపై పూర్తి విశ్వాసంతో శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారన్నారు.ఆయన సతీమణి బెల్లె హారతి వైసీపీలో ఎంపీటీసీగా ఉండి ప్రజల సంక్షేమం కోసం టిడిపి తీర్థం పుచ్చుకోవడం ప్రశంసనీయమన్నారు.ఇటువంటి వారు టిడిపికి ఎంతో అవసరమన్నారు.పార్టీ పట్ల నమ్మకం ఉన్నవారికి పదవులతో పాటు ప్రాధాన్యత లభిస్తుందన్నారు.అనంతరం బెల్లె రెడ్డి ప్రసాద్ మాట్లాడుతూ ఎమ్మెల్యే షాజహాన్ బాషా అందరిని కలుపుకుని పోయే మనస్తత్వం కలిగిన వ్యక్తి అని,ప్రజల శ్రేయస్సు కోసం పరితపించే నాయకుడు అని కొనియాడారు.అటువంటి నాయకుడి ఆధ్వర్యంలో పనిచేయడం గర్వంగా ఉందన్నారు.ముమ్ముందు తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# పేదల కడుపు నింపేందుకు అన్న క్యాంటీన్

## రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



రాయల్ జర్నలిజం,రాయచోటి, నవంబర్ 30,రాష్ట్ర ప్రభుత్వం పేదల కడుపు నిబ్బందుకే అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.శనివారం రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ యార్డ్ నందు నూతనంగా నిర్మించిన అన్న క్యాంటీన్ ను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర ముఖ్యమ ంత్రి నారాచంద్రబాబునాయుడు ఎన్నికలలో ఇచ్చిన మాట ప్రకారం గత ప్రభుత్వంలో తొలగించిన అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించడం జరిగిందన్నారు. గతంలో అన్న క్యాంటీన్లకు ఎంతో ప్రాముఖ్యత ఉండేదని మళ్లీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ప్రారంభించి పేదలు, కూలీల కడుపు నింపడం చాలా సంతోషంగా ఉందన్నారు.ప్రతి క్యాంటీన్ వద్ద పూటకి 400 మందికి, రోజుకి 1200 మందికి టిఫిన్, మధ్యాహ్నం మరియు రాత్రి పూట భోజనం ఉంటుందన్నారు. అన్న క్యాంటీన్ ల వల్ల నేడు ప్రతి పేదవాడు మూడు పూటలా భోజనం చేసి సుఖ సంతోషాలతో జీవిస్తున్నారన్నారు. ఇకనుంచి రాష్ట్రంలో ఎక్కడ కూడా ఆకలి కేకలనేటివి ఉండవన్నారు.రాయచోటి పట్టణంలో ప్రస్తుతం రెండు అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి పేద ప్రజల ఆకలి తీర్చడం జరుగుతుందన్నారు.గతంలో ఉద్యోగస్తులకు జీతాలు వృద్ధులకు పెన్షన్లు పంపిణీ చేయాలంటే ఎంతో కష్టంగా ఉండేదని నేడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎక్కడా లేని విధంగా ప్రతినెల 1వ తేదీ రాకముందే పెన్షన్ల పంపిణీ కార్యక్రమం, ఉద్యోగులకు నెలనెలా ఒకటవ తేదీన జీతాలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

# ఒకరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా

## పెన్షన్ అవ్వ,తాతలకు అందజేత



రామసముద్రం.నవంబర్ 30 రాయల జర్నలిజం.ఎన్టీఆర్ భరోసా పెన్షన్ శనివారం సూర్యోదయం ముందే సచివాలయ సిబ్బందితో కలిసి మండల టిడిపి అధ్యక్షుడు విజయ్ కుమార్ గౌడ్ గుంతల పేట గ్రామంలో అవ్వ తాతలకు వితంతువులకు,దివ్యాంగులకు ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఆయన మాట్లాడుతూ పెన్షన్ 30వ తేదీనే ప్రతి పంచాయతీలోనూ ప్రజా ప్రతినిధుల చేతుల మీదగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు.ఇది మంచి ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వం అనే విధంగా అవ్వ, తాతలకు ఆసరాగా ఉన్న పింఛన్ పంపిణీజరుగుతుందని తెలిపారు.శనివారం సాయంత్రం ఐదు గంటలకి రామసముద్రం మండలంలో దాదాపు 96% పించిలి పంపిణీ పూర్తయిందని ఎంపీడీవో భాను ప్రసాద్ తెలిపారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాయక్, రెడ్డి శేఖర్, సచివాలయ సిబ్బంది. పెన్షన్ దారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణరావు గెలుపే లక్ష్యంగా శక్తివంచన లేకుండా కృషి చేయాలి

భీమవరం, నవంబర్ 30:డిసెంబర్ 5న జరుగనున్న ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్టీయు, సీపీఐ బలపరిచిన గంధం నారాయణరావు గెలుపే లక్ష్యంగా ఏఐటియుసి శ్రేణులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని, ప్రజాస ంఘాలు, పార్టీ శ్రేణులు ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్, కాలేజీల్లో ఎన్నికల ప్రచారం విస్తృతంగా నిర్వహించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏఐటీయూసీ పశ్చిమ గోదావరి జిల్లా సమితి విస్తృత సమావేశం ఎఐటియు సి జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి,యువత సమస్యలను వారి వాణిని చట్ట సభల్లో బలంగా వినిపించడానికి గంధం నారాయణ ను గెలిపించాలని కోరారు. కార్మిక సంఘాల ఉనికిని కాపాడుకోవడానికి, ఎన్నో పోరా టాలు చేసి సాధించుకున్న హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటాలు నిర్మించడానికి భవిష్యత్తు కార్యాచరణ కు ఏఐటియుసి శ్రేణులు కార్యోన్ముఖులు కావాలని ఆయన సూచించారు. నలబై నాలుగు కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్లుగా మార్చేసి

మోడీ ప్రభుత్వం కార్మికులను కట్టుబానిసలనుచేస్తుందన్నారు. నల్ల వ్యవసాయ సాగు చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో రైతులు పద్నాలుగు నెలలు పాటు సాగించిన పోరాటం స్ఫూర్తితో కార్మికులు సంఘటిత ఉద్యమాలకు సిద్దం కావాలన్నారు. కాంట్రాక్టు కార్మికుల కనీసవేతనం 26 వేలు అమలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ తదితర సమస్యలపై ఆయన దిశానిర్దేశం చేశారు. ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు తన అధ్యక్షోపన్యాసంలో మాట్లాడుతూ మోడీ పెడ్తున్న నాలుగు లేబర్ కోడ్లు తో కార్మిక సంఘాలు పెట్టుకునే అవకాశం లేదని, ఎనిమిది గంటల పనికి మంగళం పెట్టి పన్నెండు గంటల పని విధానం వస్తుందని, పరిశ్రమల యాజమాన్యం చేతుల్లో కార్మి కులు కట్టు బానిసలుగా మారిపోతా రనన్నారు.కార్మిక చట్టాలు,హక్కుల పరిరక్షణకు సంఘటిత పోరాటాలే శరణ్యమన్నారు.

# క్రీడలలో జిల్లా కీర్తిని రాష్ట్ర స్థాయిలో నిలపాలి



ఏలూరు/ పెదవేగి ) నవంబర్ 30: క్రీడలలో జిల్లా కీర్తిని రాష్ట్ర స్థాయిలో నిలపాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి అన్నారు. శనివారం పెదవేగి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాలలో ఈనెల 28వ తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి ఎన్. సి. సి పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు చే గౌరవ వందనం స్వీకరించారు అనంతరం జిల్లా కలెక్టర్ సెల్వి జ్యోతి ప్రజ్వలన గావించి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తదుపరి జోన్ 1 2 3 4 చెందిన గురుకుల పాఠశాల క్రీడాకారుల ఫ్లాగ్ మార్చ్ . కలెక్టర్ తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రీడలు ద్వారా పట్టుదల, క్రమశిక్షణ, పోటీ తత్వము అలవడుతుందన్నారు . గ్రామీణ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో క్రీడా స్ఫూర్తితో విజయం సాధించి అంతర్జాతీయ క్రీడాకారు లుగా గుర్తింపు తెచ్చుకోవాలని పేర్కొన్నారు. విద్య ఎంత ముఖ్యమో, క్రీడలు కూడా అంతే ముఖ్యమని ప్రతి విద్యార్థి గ్రహించి ప్రతి విద్యార్థి క్రీడలలో పాల్గొని వారి జీవితాలను తీర్చిదిద్దుకో వాలని కలెక్టర్ కోరారు. ఈ సంద ర్భంగా క్రీడల్లో గెలుపొం దిన ప్రథమ, ద్వితీయ పొందిన క్రీడాకారులకు కలెక్టర్ మెమొం టోలను అందజే శారు.ఈ కార్యక్రమా నికి ముందు పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమా లను కలెక్టర్ తిలకించారు. కార్యక్రమంలో ఏపీ ఎస్ డబ్ల్యు ఆర్ ఈ ఐ సంస్థ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఎన్. సంజీవ రావు , ఏ. మురళీకృష్ణ ఏ ఎం ఓ బీవీ, మల్లేశ్వ రరావు , ఏలూరు జిల్లా ఏపీ ఎస్ డ బ్ల్యు ఈ ఐఎస్ సంస్థ ఏలూరు, తూ ర్పు, కృష్ణా జిల్లాల సమ న్వయ అధి కారులు ఎన్. భారతి, ప్రిన్సిపాల్ వెంకటరావు, కె. ప్రేమా వతి, తాసి ల్దార్ భ్రమరాంబ, ఎంపీడీవో శ్రీని వాస్, వ్యాయామ, వివిధ బోధన ఉపాధ్యాయులుప్రభృతులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన సదస్సు..



సీతానగరం:)మండలం లోని మిర్తిపాడు గ్రామంలో పోలిన రవీంద్ర పామ్ పామాయిల్ తోటలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ పెద్దాపురం ఉద్యాన శాక వారి ఆధ్వర్యంలో శనివారం ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ ఆఫీసర్ డి ఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ వారి ఆయిల్ ఫామ్ మొక్కలను ఉచితంగా ఇస్తున్నారని తెలిపారు.అలాగే ఆయిల్ ఫామ్ సాగు విస్తారణ అధిక దిగుబడులకై యాజమాన్య పద్ధతులపై తగు సూచ నాలు, సలహాలను రైతులకు ఇచ్చారు . ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఫీల్డ్ ఆఫీసర్ కె. కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ ఎరువులు యాజమాన్యము నీటి యాజమాన్య పద్దతులు చీడ పేడలను నియంత్రించడానికి అనుసరించిన పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఈ.ఓ, ఎల్. చౌదరి మాట్లాడుతూ గవర్నమెంట్ ఇచ్చి సబ్సిడీలను వివరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ నాగేశ్వరరావు, ఫీల్డ్ సిబ్బంది. పి. శ్రీనివాసరావు, పి. వీరబాబు, చుట్టుపక్కల రైతన్నలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాయల్ జర్నలిజం
ద్వైభాషా దినపత్రిక
ROYAL JOURNALISM

# వీధి కుక్కలకు రేబిస్ వాక్సినేషన్, సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు

## - నగరపాలక సంస్థ కమీషనర్ ఏ. భానుప్రతాప్



ఏలూరు,: ఏలూరు నగరంలో వీధి కుక్కల బారినుండి ప్రజలను రక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ ఏ . భానుప్రతాప్. ఏలూరులోని పశుసంవర్ధక ఆసుపత్రిలో వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలను శనివారం కమీషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ భాను ప్రతాప్ మాట్లాడుతూ, ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో సుమారుగా 1900 వీధి కుక్కలు ఉన్నాయన్నారు. వీటి కారణంగా ప్రజలు, ముఖ్యంగా చిన్నపిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలను వీధి కుక్కల నుండి రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలననుసరించి హర్యానాకు చెందిన SNEH యానిమల్ వెల్ఫేర్ సొసైటీ వారి సహకారంతో వీధికుక్కలకు పశువుల ఆసుపత్రి ప్రాంగణములో ఏలూరు నగరపాలక సంస్థ, పరిధిలోని 50 డివిజన్లలో 1900 వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు మరియు రాబిస్ వ్యాధి సోకకుండా రాబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయిస్తున్నామన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ ఇంచార్జ్ హెల్త్ ఆఫీసర్ చంద్రయ్య, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, హర్యానాకు చెందిన SNEH యానిమల్ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ హేమంత్, జిల్లెళ్ళమూడి నరసింహారావు, డావెంకయ్య, ప్రభృతుల పాల్గొన్నారు.

## జిల్లాలో శనివారం సాయంత్రానికి...

# 94. 25 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి: జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి



ఏలూరు,(ప్రత్యేక ప్రతినిధి- విశ్వ విజేత):ఏలూరు జిల్లాలో నవంబర్, 30వ తేదీ సాయంత్రానికి 94. 25 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తిచేయడం జరిగిందన్నారు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛను పధకము డిసెంబర్'1 వ తేదీ సెలవు కావడంతో.. ఫించన్లు పంపిణీని నవంబర్, 30వ తేదీనే పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. డిసెంబర్ నెలలో 2,62,836 మంది ఫించన్ దారులకు ఫించన్ పంపిణీ చేయవలసి ఉండగా 30.11.2024 ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 7 గంటల సమయానికి 2,47,722 ఫించన్లు పంపిణీ చేయడం ద్వారా 94.25 శాతం ఫించన్లు పంపిణీ పూర్తి చేయడం జరిగిందన్నారు. ఆలాగే, ప్రభుత్వం ఫించన్ దారులకు మంచి చెయ్యాలనే దృక్పదమ్ తో నవంబర్ నెలలో ఫించన్ తీసుకోని లబ్దిదారులకు 2 నెలల ఫించన్ ఈ నెలలో పంపిణీ చేయడం వలన ఫించన్ దారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. గతం లో ఏదైనా కారణం తో ఫించన్ తీసుకోక పోతే ఆ నెల ఫించన్ డబ్బులు నష్టపోవలసి వచ్చేదని, కానీ ఇప్పుడు ప్రభుత్వ కొత్త మార్గదర్శకాలు ప్రకారం 3 నెలలు ఫించన్ ఒకేసారి పొందవచ్చన్నారు. 605 సచివాలయాల పరిధి లోని 5298 మంది సిబ్బంది ప్రతి ఇంటి కి వెళ్ళి ఫించన్ అందించారన్నారు. ఈ రోజు పంపిణీ చేయగా మిగిలిన లబ్ది దారులకు మరియు వివిధ ఆరోగ్య సమస్యలతో ఇతర ప్రాంతాలలోని ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న లబ్దిదారులకు ఫించన్ లు అందించుట జరుగుతుందని, అలాగే ఫించన్ పొందని అందరి లబ్దిదారులకు సిబ్బంది స్వయంగా ఫోన్ చేసి డిసెంబర్, 2వ తేదీ సాయంత్రం లోగా 100 శాతం పంపిణీ పూర్తి చేయడం జరుగుతుందన్నారు కలెక్టర్ వెట్రి సెల్వి.

# క్రీడలలో జిల్లా కీర్తిని రాష్ట్ర స్థాయిలో నిలపాలి

## అంతర్జాతీయ క్రీడాకారులుగా గుర్తింపు తెచ్చుకోవాలి

## రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మెమొంటో ప్రదానం: జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి





పెదవేగి,: క్రీడలలో జిల్లా కీర్తిని రాష్ట్ర స్థాయిలో నిలపాలన్నారు జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి. శనివారం పెదవేగి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాలలో ఈనెల 28 నుండి మూడు రోజులపాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి ఎన్.సి.సి పాఠశాల విద్యార్థినీ విద్యార్థులచే గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి జ్యోతి ప్రజ్వలన గావించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తదుపరి జోన్ 1, 2, 3, 4 చెందిన గురుకుల పాఠశాల క్రీడాకారుల ఫ్లాగ్ మార్చ్ ను కలెక్టర్ తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి విద్యతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రీడలు ద్వారా పట్టుదల, క్రమశిక్షణ, పోటీ తత్వము అలవడుతుందన్నారు. గ్రామీణ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో క్రీడా స్ఫూర్తితో విజయం సాధించి అంతర్జాతీయ క్రీడాకారులుగా గుర్తింపు తెచ్చుకోవాలని పేర్కొన్నారు. విద్య ఎంత ముఖ్యమో, క్రీడలు కూడా అంతే ముఖ్యమన్నారు. ప్రతి విద్యార్థి దీన్ని గ్రహించాలన్నారు. ప్రతి విద్యార్థి క్రీడలలో



పాల్గొని వారి జీవితాలను తీర్చిదిద్దుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా క్రీడల్లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ పొందిన క్రీడాకారులకు కలెక్టర్ మెమొంటోలను అందజేశారు.ఈ కార్యక్రమానికి ముందు పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను కలెక్టర్ తిలకించారు. కార్యక్రమంలో ఏపీ ఎస్ డబ్ల్యు ఆర్ ఈ ఐ సంస్థ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఎన్. సంజీవరావు, ఏ. మురళీకృష్ణ ఏఎం ఓ బీవీ, మల్లేశ్వరరావు, ఏలూరు జిల్లా ఏపీ ఎస్ డబ్ల్యు ఈ ఐ ఎస్ సంస్థ ఏలూరు, తూర్పు, కృష్ణా జిల్లాల సమన్వయ అధికారులు ఎన్. భారతి, ప్రిన్సిపాల్ వెంకటరావు, కె. ప్రేమావతి, తాసిల్దార్ భ్రమరాంబ, ఎంపీడీవో శ్రీనివాస్, వ్యాయామ, వివిధ బోధన ఉపాధ్యాయులు ప్రభృతులు పాల్గొన్నారు.

## వర్షంలో ధాన్యం తడవకుండా..

# రైతులకు టార్పాలిన్లు అందిస్తున్నాం

## జాయింట్ కలెక్టర్ పి . ధాత్రిరెడ్డి







ఉంగుటూరు,వర్షాల కారణంగా ధాన్యం తడిచిపోకుండా రైతులకు టార్పాలిన్లు అందిస్తున్నామన్నారు జిల్లా జాయింట్ కలెక్టర్ పి . ధాత్రిరెడ్డి. 'ఫెంగల్' తుఫాన్ కారణంగా జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు ఆమె. క్షేత్రస్థాయిలో రైతుల ఇబ్బందులను పరిశీలించి పరిష్కరించే ఉద్దేశ్యంతో జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి శనివారం జిల్లాలోని ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు మండలాల్లోని పలు గ్రామాలలో అధికారులతో కలిసి పర్యటించారు. రైతులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గోపీనాథపట్నంలోని పలువురు రైతులను కలిసి జేసీ మాట్లాడారు. ఈ సందర్భంగా జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ.. వర్షాల కారణంగా ధాన్యం దెబ్బతినకుండా ఉండేందుకు రైతులకు టార్పాలిన్లు అందిస్తున్నామన్నారు. అవసరమైన రైతులు వారికి దగ్గరలోని రైతు సేవా కేంద్రాలలో సిబ్బందికి వివరాలు తెలిపి టార్పాలిన్లు పొందవచ్చన్నారు. ధాన్యం కొనుగోలులో ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా జిల్లా యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకున్నదన్నారు. రైతులు తమకు దగ్గరలోని రైస్ మిల్లుకు తమ ధాన్యాన్ని అమ్ముకోవచ్చన్నారు. హమాలీలు, రవాణా, రైస్ మిల్లర్లతో ఏదైనా సమస్యలు ఏర్పడితే దగ్గరలోని రెవిన్యూ లేదా వ్యవసాయ శాఖాధికారులు దృష్టికి లేదా లేదా టోల్ ఫ్రీ నెంబర్ 18004256453 కి ఫోన్ చేసి తెలియజేసినట్లైతే పరిష్కరిస్తారన్నారు. అనంతరం ఆమె భీమడోలు, దెందులూరు మండలాల్లోని పలు గ్రామాలలో రైతులను కలిశారు. వారి సమస్యలను జేసీ అడిగి తెలుసుకున్నారు. జేసీ వెంట తహసీల్దార్ పూర్ణ ప్రసాద్, రెవిన్యూ, వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణ పక్కాగా జరగాలి



## నిబంధనల ప్రకారం క్లెయిమ్లు పరిష్కరించాలి: ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ కే కన్నబాబు

## ఫిర్యాదుల విచారణ పారదర్శకంగా చేపడుతున్నాం: జిల్లా కలెక్టర్ టీ.ఎస్ చేతన్



పుట్టపర్తి,:ప్రత్యేక ఓటరు జాబితా సవరణలోభాగంగా చేపట్టిన క్లెయిమ్ల పరిష్కారం పక్కగా జరగాలి. జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి రికార్డులన్నీ అందుబాటులో ఉంచుకోవాలి. రాజకీయ పార్టీల నుంచి అందిన అభ్యంతరాలు, ఓట్ల తొలగింపునకు అందిన క్లెయిమ్ లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తరువాతనే పరిష్కరించాలి" అని ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ కే. కన్నబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కలెక్ట రేట్లోని పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్ టీఎస్ చేతన్ తో కలిసి ఓటరు జాబితా సవరణపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్ లు, ఏఈఆర్ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ, నిబంధనల ప్రకారం తప్పుల్లేని ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. అందిన క్లెయిమ్లన్నీ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. దేశంలో పెద్ద ఎత్తున జరిగే ఎన్నికల నిర్వహణలో చిన్న తప్పు జరగకుండా ఉండాలంటే ఎన్నికల కమీషన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన వారిని నూతన ఓటర్లుగా నమోదులో వివరాలు.పక్కాగా నమోదు చేయాలన్నారు. ఎన్నికల కమీషన్ నిబంధనలు పాటిస్తే తప్పులు జరిగేందుకు అవకాశం ఉండదన్నారు. బిఎల్వోలు క్షేత్రస్థాయిలో 100 శాతం ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. ప్రతి ఓటర్ల జాబితాని పరిశీలన చేయాలని, బిఎల్వోలకు శిక్షణ కూడా ఇవ్వాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు వారి ఫిర్యాదులను ముందుగానే అందించాలన్నారు. క్షేత్రస్థాయిలో నాయకులకు తెలియజేసి అందరూ సహకరించేలా చూడాలన్నారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి మెజారిటీ క్లెయిమ్స్, డిస్పోజల్స్ పూర్తి చేయాలన్నారు. ఫామ్-7 దరఖాస్తులను కమీషన్ నిబంధనలు పాటించి తొలగించాలన్నారు. పూర్తిగా 100 శాతం ప్రతి ఒక్క క్లెయిమ్, అభ్యంతరాలు ఖచ్చితంగా పరిశీలన జరగాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు అందించిన ఫిర్యాదులపై కూడా పరిశీలన తప్పనిసరిగా చేయడం జరుగుతుందని, బిఎల్వోలు మళ్లీ క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన చేస్తారన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా రూపొందించడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధుల నుండి అందిన ఫిర్యాదుల విచారణ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా చేపడుతున్నామన్నారు. ఎన్నికల కమిషన్ సూచనలు పాటించి నిబంధనల మేరకు క్లెయిమ్స్ పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 14,08,769 మంది ఓటర్లు ఉన్నారన్నారు.జిల్లాలో 1576 పోలింగ్ స్టేషన్లో ఉన్నాయని,1576 బి ఎల్ వో లు ఉన్నారన్నారు. 156-మడకశిర,(%జాజ%) హిందూపురం,157, పెనుగొండ,158, పుట్టపర్తి,-159, ధర్మవరం-160, కదిరి-161 మొత్తం 6 నియోజకవర్గాలు ఉన్నాయి నియోజకవర్గంలో ఉన్నాయని తెలిపారు.1576 బూతు లెవల్ అధికారులు నియమించడం జరిగిందని ఫామ్-6, ఫామ్-7, ఫామ్-8కు సంబంధించి వచ్చిన క్లెయిమ్స్ ను పరిశీలించడం జరుగుతోందన్నారు. నవంబర్ 24వ తేదీలోపు వచ్చిన క్లెయిమ్స్, అభ్యంతరాల ఫిర్యాదులను 29వ తేదీ నుండి గ్రామ పంచాయతీ, మండల, నియోజకవర్గ, రెవిన్యూ డివిజన్, జిల్లా స్థాయిలో విచారణ చేసి పరిష్కరించి.. 2025 జనవరి 1వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి ఫిర్యాదుల విచారణ చేసి పరిష్కరిస్తున్నామన్నారు. అర్హత కలిగిన ఒక్క ఓటరును కూడా తొలగించకుండా చర్యలుచేపడుతున్నామన్నారు. క్షేత్రస్థాయిలో ఏవైనా క్లెయిమ్స్, అభ్యంతరాల విషయమై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. 01.01.2025 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ఈ విషయమై రాజకీయ పార్టీల నాయకులు కూడా యువకులకు తెలియజేయాలన్నారు. ఈవీఎంలు ఏ విధంగా ఉపయోగించాలి, ఓటింగ్ విధానంపై అవగాహన చేపడుతున్నామన్నారు. ఫిర్యాదుల పరిష్కారం పారదర్శకంగా జరుగుతోందని, తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేసేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకుల సహకారం అందించాలన్నారు. డబుల్ ఎంట్రీస్, ఫోటో జాబితా ఎన్నికలు సంబంధించిన అంశాలపై రాజకీయపార్టీ ప్రతినిధులు అబ్జర్వర్ వివరించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ విజయ సారథి, నియోజకవర్గ ఎన్నికల అధికారులు, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, టి ఆనంద్ కుమార్, పి సువర్ణ, మహేష్, వివిఎస్ శర్మ, పార్టీ ప్రతినిధులు తెలుగుదేశం సాముకోట ఆదినారాయణ, సిపిఎం పార్టీ ప్రతినిధి గంగాధరం, మున్సిపాలిటీల కమిషనర్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

# ఏపీలో కొత్తగా నేషనల్ హైవే.. ఈ రూట్‌లోనే, నాలుగు లైన్లుగా.. పనులు వేగవంతం



అమరావతి :ఏపీలో మరో నేషనల్ హైవే పనులు వేగవంతో అయ్యాయి. మొత్తం 82 కిలోమీటర్ల రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించి అభివృద్ధి చేయడానికి కేంద్రం రూ.1851 కోట్లు కేటాయించింది. వాడరేవు నుంచి చిలకలూరిపేట వరకు ఒక ప్యాకేజీగా.. అలాగే చిలకలూరిపేట నుంచి నకరికల్లు అడ్డరోడ్డు వరకు మరో ప్యాకేజీగా నిధులు కేటాయించారు. బాపట్ల జిల్లా పర్చూరు సమీపంలో పనుల్ని వేగవంతం చేశారు. రోడ్డుతో పాటూ ఫ్లై ఓవర్లను నిర్మిస్తున్నారు.ఏపీలో మరో కొత్త హైవే పనులు వేగవంతం అయ్యాయి. 167ఏ జాతీయ రహదారి పిడుగురాళ్ల నుంచి వాడరేవు వరకు దాదాపు 82 కిలోమీటర్ల మేర హైవే నిర్మాణం జరుగుతోంది. ఈ మేరకు బాపట్ల జిల్లా పర్చూరును అనుసంధానిస్తూ కారంచేడు మీదుగా వాడరేవు వరకు హైవే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం పర్చూరు-కారంచేడు మధ్య పనుల్లో స్పీడ్ పెంచారు. ఓ వైపు రోడ్డు నిర్మాణంతోపాటుగా కల్వర్టులు, ఫ్లైఓవర్ ఏర్పాటుపై ఫోకస్ పెట్టారు. ముఖ్యంగా పర్చూరు వై జంక్షన్‌లో ఫ్లైఓవర్‌ను నిర్మించే విధంగా ప్రతిపాదించారు.ప్రస్తుతం ఆ వైజంక్షన్ కూడలిలో ఫ్లైఓవర్ పనులు వేగవంతం అయ్యాయి. ఈ హైవే నిర్మాణంతో తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ మధ్య రవాణా మరింత సులభతరం కానుంది. అలాగే వాడరేవు ఉండటం వల్ల పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందుతుంది అంటున్నారు. అలాగే వాణిజ్య వ్యాపార రంగం అభివృద్ధికి హైవే నిర్మాణం ఎంతగానో దోహదపడుతుందంటున్నారు. ఈ హైవేను నాలుగు వరుసలుగా విస్తరించి అభివృద్ధి చేయడానికి కేంద్రం రూ.1851 కోట్లను కేటాయించింది.ఈ జాతీయ రహదారి పనుల్ని ఈపీసీ విధానంలో చేపట్టారు. వాడరేవు నుంచి చిలకలూరిపేట వరకు ఒక ప్యాకేజీగా.. చిలకలూరిపేట నుంచి నకరికల్లు అడ్డరోడ్డు వరకు మరో ప్యాకేజీగా విభజించారు అధికారులు. ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రాష్ట్రాలను అనుసంధానం చేస్తున్న అద్దంకి-నార్కెట్‌పల్లి హైవే నుంచి నకరికల్లు దగ్గర విడిపోయి బాపట్ల జిల్లా వాడరేవు వరకు వెళుతుంది. చీరాల సమీపంలో ఒంగోలు-దిగమర్రు, చిలకలూరిపేట వద్ద చెన్నై-కోల్‌కతా రహదారులతో ఇది అనుసంధానం అవుతుంది.హైదరాబాద్ నుంచి సముద్రతీర ప్రాంతానికి అనుసంధానం చేయడంలో ఈ మార్గం కీలకం అంటున్నారు. అంతేకాదు చెన్నై నుంచి తెలంగాణ వైపు వెళ్లే వారికి ఇది దగ్గరి దారి అవుతుందని చెబుతున్నారు. కేంద్రం సరకు రవాణాలో కీలకపాత్ర పోషిస్తున్న రహదారి విస్తరణను గుర్తించి నాలుగు వరుసలుగా అభివృద్ధి చేస్తోంది. అంతేకాదు మత్స్య సంపద, వ్యవసాయ ఉత్తత్తులు ఎగుమతి చేయడానికి జాతీయ రహదారి ఎంతగానో దోహద పడుతుంది అంటున్నారు. ఈ హైవే పనుల్ని వేగవంతో చేసి త్వరలోనే అందుబాటులోకి తీసుకొచ్చే పనిలో ఉన్నారు.

# తిరుమల వెళ్లే రాజకీయనేతలకు హెచ్చరిక.. కొత్త రూల్ అమల్లోకి, కఠినంగా చర్యలు



అమరావతి : తిరుమలలో రాజకీయ ప్రసంగాలకు బ్రేకులు పడిపోయాయి.. ఈ మేరకు టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. తిరుమల పవిత్రతను, ఆధ్యాత్మిక ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు.. ఇకపై కొండపై రాజకీయ, ద్వేషపూరిత ప్రసంగాలను నిషేధించాలని టీటీడీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. నిత్యం గోవింద నామాలతో మార్మోగే పవిత్రమైన తిరుమల దివ్య క్షేత్రంలో.. గత కొంతకాలంగా రాజకీయ నాయకులలో కొంతమంది శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చి.. దర్శనం అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతున్న విషయాన్ని టీటీడీ గుర్తు చేసింది. కొందరు నేతలు రాజకీయ ప్రసంగాలు, విమర్శలు చేయడం పరిపాటిగా మారిందని.. దీంతో తిరుమలలో ఆధ్యాత్మిక వాతావరణానికి ఆటంకం కలుగుతోంది అన్నారు.ఈ క్రమంలో రాజకీయ ప్రసంగాలను నిషేధించాలని టీటీడీ బోర్డు ఇటీవల తీర్మానించిన సంగతి తెలిసిందే. తిరుమలకు వచ్చేసి రాజకీయ విమర్శలు చేసే వ్యక్తులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని.. తిరుమలలో ఆధ్యాత్మిక వాతావరణం దెబ్బతీసే ప్రసంగాలకు దూరంగా ఉండి సహకరించాలని టీటీడీకి విజ్ఞప్తి చేసింది. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ప్రకటనలో తెలియజేసింది.రాజకీయ నేతలు, భక్తులు ఈ విషయాన్ని గమనించాలిన కోరింది టీటీడీ.

**తిరుచానూరు బ్రహ్మోత్సవాలు**

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు అమ్మవారికి స్నపన తిరుమంజనం శోభాయమానంగా జరిగింది. మధ్యాహ్నం 12.30 నుండి 2.30 గంటల వరకు ఆలయంలోని శ్రీకృష్ణస్వామి ముఖ మండపంలో ప్రత్యేకంగా ఫల పుష్పాలతో రూపొందించిన మండపంలో పాంచరాత్ర ఆగమశాస్త్రబద్ధంగా ఈ వేడుక వైభవంగా జరిగింది. కంకణభట్టర్ శ్రీ శ్రీనివాస ఆచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యహావచనం, నవకలశాభిషేకం, రాజోపచారం నిర్వహించారు. అనంతరం ఛత్ర చామర, వ్యజన దర్పణాది నైవేద్యం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం చేపట్టారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, గంధంతో స్నపనం నిర్వహించారు. శంఖధార, చక్రధార, సహస్రధార, మహాకుంభాభిషేకాలను నిర్వహించారు.ఈ సందర్భంగా తైత్తరీయ ఉపనిషత్తు, పురుషసూక్తం, శ్రీప్రశ్నసంహిత మంత్రాలను అర్చకులు పఠించారు. ఈ వేడుకలో ఒకో క్రతువులో ఒక మాల వంతున ఏడు రకాల మాలలను అమ్మవారికి అలంకరించారు. నేమలి ఈకల మాల, తాయర గింజలు, పైనాపిల్, రోజ్ పెటల్స్, నెల్లికాయ, తులసి, రంగురాళ్లతో కూడిన రోజామాలలు అమ్మవారికి అలంకరించారు. స్నపనతిరు మంజనం నిర్వహించే శ్రీ కృష్ణముఖ మండపాన్ని వివిధ రకాల సాంప్రదాయ పుష్పాలు, కట్ ఫ్లవర్స్, అపురూపమైన పుష్పాలు, రెడ్, గ్రీన్ యాపిల్, మొక్కజొన్న, జామ, ఆరంజ్ తదితర ఫలాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఈ మండపాన్ని 20 మంది టీటీడీ గార్డెన్ సిబ్బంది రెండు రోజుల పాటు శ్రమించి అలంకరించారు.శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలోని ధ్వజమండపం, గర్భాలయం, శ్రీకృష్ణస్వామివారి ఆలయం, శ్రీ సుందరరాజస్వామివారి ఆలయం, వాహనమండపం, ఆస్థానమండపం టీటీడీ గార్డెన్ విభాగం ఆధ్వర్యంలో వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. గార్డన్ డెప్యూటీ డైరెక్టర్ శ్రీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో దాదాపు 70 మంది సిబ్బంది మూడు రోజుల పాటు శ్రమించి సుందరంగా అలంకరించారు.

# మరోసారి విద్యుత్ ఛార్జీల పెంపు - రూ 9,412 కోట్ల భారం, ఎవరి పై ఎంత..!



